



నుమాయిష్‌లో సందర్శకుల సందడి..



# నుమాయిజోష్

**ఎగ్జిబిషన్‌కు రోజురోజుకు పెరుగుతున్న సందర్శకుల తాకిడి.. సంక్రాంతి వరకు మరింత పెరిగే అవకాశం**



నుమాయిష్‌కు పెద్దఎత్తున తరలివచ్చిన సందర్శకులు

సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ) / అబిడ్స్ : నగరంలో నుమాయిష్ 'నయా' జోష్‌ను నింపింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 1న మొదలైన 83వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన వచ్చే నెల 15వ తేదీ వరకు 45రోజుల పాటు కొనసాగనున్నది. నాలుగు రోజుల కిందట ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌కు రోజురోజుకు సందర్శకుల తాకిడి పెరుగుతున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. సంక్రాంతి వరకు మరింత పెరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది అంచనాలకు మించి దాదాపు 25 లక్షల పైచిలుకు సందర్శకులు రానున్నట్లు సొసైటీ ప్రతినిధి సంజీవరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఎగ్జిబిషన్‌కు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసిన తర్వాతే సందర్శకులను లోపలికి అనుమతిస్తున్నారు. అగ్నిమాపక యంత్రాలను సైతం అందుబాటులో ఉంచారు.

## విద్యుత్ వెలుగుల్లో జిగేల్ మంటున్న స్టాల్స్..

1938లో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ప్రారంభమైన ఎగ్జిబిషన్ 1946లో ఎగ్జిబిషన్ మైదానంలోకి మారింది. అప్పటి నుంచి 26 ఎకరాల సువిశాల మైదానంలో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం సందర్భకుల కోసం 2400 స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఫుడ్ కోర్ట్స్, హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులు, ఫర్నీచర్, క్లాత్ స్టాల్స్, అమ్యూజ్‌మెంట్ పార్కు ఆకట్టుకుంటున్నాయి. సందర్శకులు ఎగ్జిబిషన్‌లో ట్రైన్‌పై మైదానం మొత్తం చుట్టివస్తున్నారు.

## మెట్రో రైలు సమయం పొడిగింపు

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు సందర్శకులు రోజురోజుకు పెరుగుతున్నారని ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిసిటీ కన్వీనర్ జీవీ రంగారెడ్డి పేర్కొన్నారు. పబ్లిసిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీన ప్రారంభమైన ప్రదర్శనకు సందర్శకులు తరలి వచ్చి స్టాల్స్‌లలో విక్రయాలు చేపడుతున్నారని తెలిపారు. నగరంలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని, సందర్శనకు తరలి వచ్చే సందర్శకుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడపడంతో పాటు మెట్రో రైలు సమయాన్ని పొడిగించిందన్నారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, సీసీ కెమెరాల నిఘా, పోలీస్ శాఖ ద్వారా బందోబస్తు, వలంటీర్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.



జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (ఎన్నికల విభాగం)గా పనిచేసి తెలంగాణ టెక్నికల్ సర్వీసెస్ ఎండీగా నియమితులైన శంకరయ్య గురువారం కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

- సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ)

# కొత్తవా? అద్దెవా?

- ఆర్టీసీకి చిక్కులు తెచ్చిపెట్టిన మహాలక్ష్మి పథకం
- అరకొర బస్సులతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లు
- కొత్త బస్సులు తెస్తే.. డ్రైవర్లు, కండక్టర్ల కొరత
- అద్దె బస్సులకు సమస్యల బెడద
- తర్జన భర్జనలో ఆర్టీసీ యాజమాన్యం..
- ఐదువేల డ్రైవర్లు, కండక్టర్ల నియామకం చేపట్టాల్సిందే..?

సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆర్టీసీ యాజమాన్యానికి ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఉచిత బస్సు సౌకర్యంలో మహిళలందరూ ప్రైవేటు వాహనాలు వీడి, ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులన్నీ మహిళా ప్రయాణికులతో కిటకిట లాడుతుండటంతో ప్రయాణికులతో పాటు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి సంక్లిష్టమైన పరిస్థితుల నుంచి సాధారణ పరిస్థితులు తీసుకురావాలంటే.. తక్షణమే అదనపు బస్సులను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఆర్టీసీకి రానే వచ్చింది.

## దాదాపు 5వేల డ్రైవర్లు, కండక్టర్లు కావాల్సిందే

గ్రేటర్ జోన్ అవసరాలకు అనుగుణంగా 1000 బస్సులు కొత్తగా కొనుగోలు చేస్తే ఆ బస్సులకు అనుగుణంగా అదనపు డ్రైవర్లు, కండక్టర్ల నియామకం జరగాల్సి ఉంది. ప్రస్తుతం నగరంలో కేవలం 2400 బస్సులకు సరిపడా డ్రైవర్లు, కండక్టర్లు మాత్రమే ఉన్నారు. అంటే కొత్త బస్సులు కొనాలంటే ఆ బస్సులు వచ్చేలోగా కొత్తగా నియామకాలు పూర్తి చేయాలి. ఒక వేళ కొత్త బస్సులు తెస్తే.. దానికి సరిపడే విధంగా అంటే దాదాపు 5వేల వరకు డ్రైవర్లు, కండక్టర్ల నియామకం తక్షణం చేపట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆర్టీసీ అధికారులలో కొందరు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తుంది.

## గ్రేటర్ జోన్‌కు 4000 బస్సులు అవసరం..

గ్రేటర్ పరిధిలో తిరుగుతున్న 2700 బస్సులు సరిపోవడం లేదు. ప్రస్తుతం ఉన్న వాటిలో 1000 బస్సుల వరకు కాలం చెల్లినవే ఉన్నాయి. ప్రస్తుత రద్దీకి అనుగుణంగా గ్రేటర్‌లో 4వేల బస్సులు నడపాల్సి ఉండగా.. కాలంచెల్లిన బస్సులను తీసేస్తే.. కేవలం 1700 బస్సులు మాత్రమే ఆర్టీసీకి ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అంటే మరో 2300 బస్సులు అవసరం ఉండగా.. వాటిని కొత్తగా కొనుగోలు చేయాలా..? లేదా ప్రైవేటు అద్దె బస్సులను సేకరించాలా..? అన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయి.

## మరో 290 బస్సులు ఎలా..?

గ్రేటర్ పరిధిలో కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి తుది ఆమోదం లభించాల్సి ఉంది. అప్పటివరకు 340 అద్దె బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించి టెండర్లు పిలువగా కేవలం 50 బస్సులకు మాత్రమే ప్రైవేటు ఓనర్లు టెండర్లు దాఖలు చేశారు. మిగిలిన 290 బస్సుల కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. తమ షరతులను ఒప్పుకుంటే అద్దె బస్సులు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ప్రైవేటు అద్దె బస్సు యాజమాన్యాల సంక్షేమ సంఘం నాయకులు ఇప్పటికే తెలిపినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం ఆ దిశగా ముందుకు రావడం లేదని తెలుస్తున్నది.



దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీని గురువారం తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజిద్ ఆధ్వర్యంలో ప్రతినిధులు సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేసి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- జూబ్లీహిల్స్, జనవరి 4

# కూతురిపై కన్నతండ్రి లైంగిక దాడి

- ఆశ్రయమిచ్చిన యువకులు సైతం అఘాయిత్యం
- జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి

జీడిమెట్ల, జనవరి 4 : కన్నతండ్రే కామాంధుడై కూతురిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడగా.. ఆశ్రయమించిన మరో ఇద్దరు యువకులు సైతం అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన చంద్రమ సింగ్, దంపతులు నగరానికి వలస వచ్చి కుటుంబంతో సహా కుత్బుల్లాపూర్ గ్రామంలో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె 9వ తరగతి వరకు చదివి కరోనా సమయంలో చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. తల్లిదండ్రులు ఇద్దరు డ్యూటీలకు వెళ్లేవారు. కాగా తండ్రి చంద్రమసింగ్ ఇంట్లోనే ఉంటున్న పెద్ద కూతురిపై పలుమార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లికి చెప్పినా పట్టించుకోకపోవడంతో.. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. ఇదిలా ఉండగా బడంగ్‌పేట గాంధీనగర్‌కు చెందిన సంతోష్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. గత నెల 26న బాధిత యువతి సంతోష్‌ను కలిసేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లింది. రాత్రి బడంగ్‌పేట్‌లోని సంతోష్ ఇంట్లోనే ఉండగా.. 27న ఉదయం ఇంటినుంచి వెళ్లిపోవాలని తిరస్కరించాడు. దీంతో ఎటుపోవాలో తెలియక రవి అనే యువకుడిని కలిసి జాబ్ చూడాలని కోరగా.. అమీన్‌పూర్‌లోని తన గదికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 30న అక్కడి నుంచి బయటపడిన యువతి ఇంటికి చేరింది. అప్పటికే జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. అయితే తల్లిదండ్రులు యువతిని నిలదీయగా జరిగిన విషయం తెలుపింది. దీంతో జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.